www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 1 ఏప్రిల్ 2023



పల్లవోలు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ప్రజాశక్తి-కలికిరి

పల్లవోలు పంచాయతీ కార్యదర్శి విష్ణుకావ్య సస్పెండ్ చేసినట్లు ఎంపిడిఒ గంగయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆమె మూడేళ్లుగా పల్లవోలు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆమె ప్రవర్తన సక్రమంగా లేకపోవడం, విధులు నిర్వహించడం పట్ల నిర్లక్ష్యం వహించడం, అధికారులు, తోటి సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, ప్రజలతో దురుసుగా మాట్లాడడం, ప్రవర్తించడం వంటి కారణాలతో పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో అధికారులు సమావేశం ఏర్పాటు చేసి ఆమెను వివిధ నుండి తొలగించాలని తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి అందరూ ఆమోదం తెలపగా ఆ ప్రతిని ఎంపిడిఒకు పంపించారు. ఆయన జిల్లా పంచాయతీ అధికారికి ద్వారా కలెక్టర్‌కు పంపించారు. దీన్ని పరిశీలించిన కలెక్టర్ గిరీష విష్ణుకావ్యాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపిడిఒ గంగయ్య తెలిపారు.

చెత్త పన్ను వసూలుకు వేళాయే

- ఇంటి పన్నుతో కలిసి చెత్తపన్ను?!
- ప్రభుత్వ నిర్ణయంపై విస్మయం
- నేటి నుంచి వసూలు షురూ

జిల్లాలో చెత్తపన్ను వసూళ్లకు వేళైంది. ప్రభుత్వం ఏడాది కిందట చెత్త పన్ను వసూలు చేయసంకల్పించింది. చెత్త పన్ను వసూలు జిఒను సిపిఎం వెలుగులోకి తెచ్చి ఆందోళన చేపట్టింది. చెత్తపన్ను వసూలు అంశం పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ప్రతిపక్షాలు పోరుబాట పట్టినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. చెత్త పన్ను వసూలును సులభతరం చేయాలనే ఉద్దేశంతో ఇంటి పన్నుతో కలిపి చెత్తపన్ను వసూళ్లను అనుసంధానం చేయడానికి కసరత్తు చేస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని కడప కార్పొరేషన్ సహా మిగిలిన మున్సిపాలిటీల్లో చెత్త పన్ను వసూలుకు రంగం సిద్ధమైంది. ఏడాది కిందటి నుంచి కడప నగర పాలక సంస్థ, ప్రొద్దుటూరు మున్సిపాలిటీల్లో మాత్రమే వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. కడప, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అనుభవాల ఆధారంగా ఏప్రిల్ నుంచి కడప కార్పొరేషన్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీలు సహా మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ మున్సిపాలిటీల్లో వసూలు చేయనున్నారు. కడప కార్పొరేషన్ సహా జిల్లాలోని మున్సిపల్ యంత్రాంగాలు కార్యాచరణను వేగవంతం చేసింది. క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో ఇంటి పన్నుతో కలిపి చెత్త పన్ను వసూలు చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం (బడ్జెట్ ముందటి) సందర్భంగా వామపక్షాలు చెత్తపన్ను మినహాయించాలని ఆందోళన చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో కమలాపురం ఎమ్మెల్యే, మేయర్, సహా పలువురు కార్పొరేటర్లు ఎన్నికల ముంగిట చెత్తపన్ను వసూలును వాయిదా వేయాలనే డిమాండ్ మేరకు తీర్మానం చేసి పంపించినప్పటికీ ఎటువంటి ప్రయోజనమూ లేకుండా పోయింది. స్లమ్ ఏరియాలో రూ.40, మిగిలిన ఏరియాలో రూ.90 చొప్పున వసూలు చేస్తున్నారు. పన్ను వసూలు నిమిత్తం సచివాలయ సిబ్బంది గుంపులుగా ఇళ్ల దగ్గరకు వెళ్లి వసూలు చేస్తుండడం పట్ల విమర్శలు వెల్లువెత్తినప్పటికీ తగ్గలేదు.

క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) ప్రోగ్రామ్‌లో భాగంగా చెత్తసేకరణ వేగవంతమైంది. ప్రతి ఇంటి



దగ్గర నుంచి తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాల్సి ఉంది. ఇటువంటి చెత్త సేకరణ కాంట్రాక్టును ఓ ప్రయివేటు సంస్థకు కట్టబెట్టింది. ఆ సంస్థ కడప కార్పొరేషన్‌లో 100 ఆటోలను ఏర్పాటు చేసింది. 90 ఆటోలు మాత్రమే పన్ను వసూలు ప్రక్రియలో పాలు పంచుకుంటున్నాయి. ఒక్కో ఆటో నెలకు రూ.63 వేలు చొప్పున రూ.61 లక్షలు వసూలు చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతుండడం గమనార్హం.

రోజూ ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించడం అంతంత మాత్రంగా సాగుతోంది. చెత్త సేకరణ కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడం, వాహనాలు మొరాయించడం వంటి కారణాలతో చెత్త సేకరణ ప్రక్రియ సజావుగా సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి. కార్పొరేషన్, మున్సిపాలిటీల శివారు ప్రాంతాల్లో రెండు, మూడురోజులకు ఒకసారి

మ్యాపింగ్ వివరాలు

మున్సిపాల్టీ	నివాసాలు	మ్యాపింగ్
కడప	1,04,177	96,263
ప్రొద్దుటూరు	40,900	31,600
బద్వేల్	17,962	15,234
మైదుకూరు	6,513	7,754
పులివెందుల	21,000	19,000

చెత్తను సేకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వేళాపాళా లేకుండా చెత్త సేకరిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. నెలకు చెత్త పన్ను ద్వారా కార్పొరేషన్‌లో రూ.41 లక్షలు వసూలు అవుతోంది. పన్ను వసూలు చేసినా చేయకున్నా ప్రయివేటు సంస్థ మాత్రం కార్పొరేషన్, మున్సిపాలిటీలకు పన్ను చెల్లించాల్సి ఉంది. ప్రజల నుంచి పన్ను వసూలు సజావుగా సాగని నేపథ్యంలో సాధారణ నిధుల నుంచి చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

ఇంటి పన్నుతో కలిపి చెత్తపన్ను వసూలు చేయడానికి రంగం సిద్ధమైంది. సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఇంటి పన్ను వసూలు కోసం ఒత్తిడి పెంచడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం చెత్త పన్ను వసూలు చేయడానికి సులభతర మార్గాన్ని అన్వేషించారు. చెత్త పన్ను కూడా ఇంటి పన్నుతో కలిపి వసూలు చేయాలని నిర్ణయించడం గమనార్హం. ఇంటి పన్నుతో కలిపి చెత్త పన్ను వసూలు చేయడానికి ఉద్దేశించి ఇళ్ల మ్యాపింగ్ చేసే ప్రక్రియను చేపట్టనున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆదేశాలు అందిన వెంటనే చకచకా మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలుస్తోంది.



కనులపండువగా ధ్వజారోహణం

ప్రారంభమైన కోదండరాముని బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఒంటిమిట్టలోని పురాతన చారిత్రకప్రాశస్త్యం గల శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 నుండి 10.20 గంటల వరకు వృషభలగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెఇఒ వీరబ్రహ్మం మాట్లాడుతూ ధ్వజారోహణంతో వైభవంగా రాములవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్టు తెలిపారు. ఈ ఉత్సవాల్లో ప్రధానంగా ఏప్రిల్ 3న హనుమంత వాహనం, 5న కల్యాణోత్సవం, 6న రథోత్సవం, 8న చక్రస్నానం జరుగుతాయన్నారు. కల్యాణం రోజున ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకొని ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణానికి విశేషంగా విచ్చేసే భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపడతామన్నారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ ముందుగా గరుడ ధ్వజ పటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, నేత్రోన్మీలనం నిర్వహించామన్నారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేసినట్టు చెప్పారు. రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకలదేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, శిక్షణ కలెక్టర్ రాహుల్ మీనా, ఆలయ డెప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్లు పి.వెంకటేశయ్య, ఆర్సీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శేషవాహనంపై దర్శనమిచ్చిన కోదండరాముడు

శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజైన శుక్రవారం రాత్రి శేషవాహనంపై సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారు. భక్తులను కటాక్షించారు. రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవ నిర్వహించారు. ఆలయ మాడ వీధుల్లో కేరళ వాయిద్యాలు, భక్తజన బృందాలు చెక్క భజనలు, కోలా టాలతో స్వామివారిని కీర్తిస్తుండగా మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.



శేషవాహనంపై ఊరేగుతున్న కోదండరాముడు

కల్యాణోత్సవం ఏర్పాట్లను పరిశీలించిన జెఇఒ

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామిబ్రహోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 5న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా భక్తుల కోసం చేయాల్సిన ఏర్పాట్లను టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ శుక్రవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి కల్యాణోత్సవం రోజున పట్టువస్త్రాల సమర్పణకు వచ్చినపుడు ఆలయంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో జెఇఒ చర్చించారు. కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. గ్యాలరీల్లో భక్తులకు కల్పించాల్సిన వసతులు ఇతర ఏర్పాట్లపై జిల్లా అధికారులతో చర్చించారు. జెసి సాయికాంత్ వర్మ మాట్లాడుతూ జిల్లా నుంచి డెప్యుటేషన్ మీద నియమించిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆలయం వద్దగల పరిపాలన భవనంలో జెఇఒ వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్ర మంలో డిఎఫ్ఒ శ్రీనివాస్, ఎస్ఇ(ఎలక్ట్రికల్స్) వెంకటేశ్వర్లు, డిఇ చంద్రశేఖర్, ఇఇ సుమతి, డెప్యూటీ ఇఒలు గుణభూషణ్‌రెడ్డి, నటేష్ బాబు, శివప్రసాద్, సుబ్రహ్మణ్యం, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షల నిర్వహణ : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ గిరీష విద్యాశాఖ చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ నందలి స్పందన హాలులో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై డిఇఒ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులతో ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన జిల్లాలో గత సంవత్సరం పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి మంచి పేరు తీసుకువచ్చారని తెలిపారు. ఈ ఏడాది కూడా ఎలాంటి చిన్న పొరపాటుకు, సంఘటనలకు తావివ్వకుండా పరీక్షలను చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా విజయవంతం చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు అన్ని పూర్తి చేయాలని డిఇఒకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరాదన్నారు. ప్రభుత్వం కూడా ఈ మేరకు ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, వైద్య శాఖ ఎఎన్ఎంతో పాటు విద్యార్థులకు అవసరమైన మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని పరీక్షల సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, అన్నమయ్య జిల్లాలో పదవ తరగతి పరీక్షల విజయవంతానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. అనంతరం డిఇఒ పురుషోత్తం మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. గత సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వరాదన్నారు. పరీక్షల నిర్ణీత సమయానికి ముందే అధికారులందరూ పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా సమయం 15 నిమిషాల ముందు మాత్రమే క్వశ్చన్ పేపర్లను ఓపెన్ చేయాలన్నారు. మాస్ కాపీయింగ్ ప్రోత్సహించరాదని, మొబైల్ ఫోన్స్ తీసుకెళ్లకూడదని వివరించారు. అవగాహన కార్యక్రమంలో చెందిన చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పరీక్షలు ఏర్పాట్లు పూర్తి : పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా పరిశీలకులు వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. డిఇఒ పురుషోత్తంతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 22,395 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఫ్లేయింగ్ స్క్వాడ్ 16, సిట్టింగ్స్ స్క్వాడ్ 16, ఇన్విజిలేటర్లు 1260, అదనపు సిబ్బంది 6 మంది పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.



మోహినీ అవతారంలో ఊరేగుతున్న పట్టాభిరాముడు

మోహినీ అవతారంలో తేజోమూర్తి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

వాల్మీకిక్షేత్రంలో వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన శ్రీ పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం రాత్రి 8 గంటలకు పల్లకీలో మోహినీ అవతారంలో తేజోమూర్తిగా మురిపిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8గంటలకు సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు తేజోమూర్తిగా తిరుమాఢవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ వరలక్ష్మీ, ఎఇఒ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్‌రాయులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది దుశంత్, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

నేడు రాములోరి కల్యాణం

జగదానంద కారకుడి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాల్మీకిపురం శ్రీ పట్టాభిరాముడు బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి జరగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి టిటిడి అధికారులు ముస్తాబు చేస్తున్నారు. స్థానిక తోటివీధిలో ముమ్మరంగా కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణోత్సవానికి తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి వేలల్లో భక్తులు హాజరవుతుండడంతో, భక్తులను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఇబ్బందులు లేకుండా షెల్టర్, చలవ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

సచివాలయ సిబ్బంది బాధ్యతతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు. శుక్రవారం వార్డు ప్లానింగ్ కార్యదర్శులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా భవనాల నిర్మాణాలు జరగకూడదని సూచించారు. అలాంటి వాటికి వెంటనే నోటీసులు జారీ చేసి, ఛార్జ్‌షీట్ వేయాలని సూచించారు. అక్రమ లే అవుట్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం కొరకు ప్రణాళిక సిద్ధం చేయాలని టౌన్ ప్లానింగ్ సూపెరవైజర్ లక్ష్మిని ఆదేశించారు. ప్రతి కార్యదర్శి తమ ఉద్యోగానికి అనుగుణంగా పని చేయాలని సూచించారు. రోడ్లు, మురుగు కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మున్సిపల్ అనుమతి లేకుండా ఎక్కడపడితే అక్కడ హోర్డింగ్‌లు, బోర్డులు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాణిజ్య సముదాయాల, దుకాణల అడ్వటైజ్మెంట్ పన్నులు తప్పక వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో టిఎస్‌పి లక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, సిబ్బంది సౌమ్య, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని సున్నపురాళ్ళపల్లె అంగన్వావాడీ కేంద్రం విద్యార్థులకు పలక, బలపం కట్ట, నోటు పుస్తకాలు,పెన్ను, పెన్సిల్, షార్ప్నర్ కిట్‌లను వేంపల్లి బాష, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి అబూబకర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్ రాయుడు హాజరై విద్యార్థులకు స్కూల్ కిట్‌లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులతో రచ్చబండ దగ్గర బత్యాల సమావేశమై వారితో ముచ్చటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిటిడి మండల అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రేవూరి నరసింహ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, పార్లమెంట్ అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు, మండల ప్రధాన కార్యదర్శి చెప్పలి కేశవ, పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డెయ్య, మాజి మండల పార్టీ అధ్యక్షుడు కొండయ్య నాయుడు, సున్నపురాళ్ళపల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడు రసూల్, మాజీ ఆర్మీ మదార్ సాహెబ్, దుగ్గినేని చంద్రబాబు, తెలుగుయువత అసెంబ్లీ ఉపాధ్యక్షులు అనుమలగుండం విజయ్, బూత్ కన్వీనర్లు మల్లెం నరేష్ రాయల్, ఓబిలి మల్లికార్జునరెడ్డి, తోట ప్రసాద్, అనుగోలు వరకృష్ణ పాల్గొన్నారు.

ఆదర్శ టౌన్‌షిప్‌గా రాజీవ్ స్వగృహ : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాజీవ్ స్వగృహను ఆదర్శ టౌన్‌షిప్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజీవ్ స్వగృహలో రూ 3.81 కోట్ల అంచనా నిధులతో సిసి రోడ్లు, మౌలిక వసతుల నిర్మాణాలకు జరిగిన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల వ్యవధిలో ఈ పనులను పూర్తి చేయాలని అధికారులును ఆదేశించారు. రాజీవ్ స్వగృహలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులుతోనూ, గృహ యజమానులుతోనూ కూలంకుశంగా చర్చించారు. సుమారు రూ.4 కోట్ల నిధులుతో పార్క్, పాత రోడ్డు రెన్యూవల్, సుందరీకరణ పనులను కూడా చేపడతామని తెలిపారు. 57 ఏకరాలలోవున్న లే అవుట్‌ను అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. 147 ప్లాట్లు, పాతవి 7 ప్లాట్లను వేలం వేయాల్సిఉందన్నారు. అటు జిల్లా కలెక్టరేట్, ఇటు ఎస్పి కార్యాలయం మధ్యలో రాజీవ్ స్వగృహ శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చెందుతుండడంపై రాజీవ్ స్వగృహ ఆనంద నిలయం గృహ యాజమానుల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, జడ్‌పిటిసి వెంకటేశ్వరరెడ్డి, బిసి నాయకులు పల్లపు రమేష్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, కో-ఆప్షన్ అయ్యవారురెడ్డి, కాంట్రాక్టర్ చలమారెడ్డి పాల్గొన్నారు.

27 మంది రక్తదానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రక్తదానం చేయడం ద్వారా ఒక నిండు జీవితాన్ని కాపాడవచ్చునని, రక్తదానం చేసిన వారు ప్రాణదాతలని ఎంబిబిఎస్ ఎండి, పెథాలజీ అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ కె.చంద్రకళ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ చంద్రకళ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 27 మంది దాతలు రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తెలియజేశారు.

మాతృ మరణాల్లేకుండా చూడండి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-రాయచోటి

వైద్య సిబ్బంది మాతా శిశు సంరక్షణ సేవలు సక్రమంగా అందించి మాతృ మరణాలు జరగకుండా చూడాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఫిబ్రవరి, మార్చి నెలలో జరిగిన మాతృ మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాపురం, ఎండపల్లి, చిన్నమండెం, ఓబులవారిపల్లి, చెంబకూరు, మదనపల్లిలో జరిగిన మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ ఉషశ్రీ, రాయచోటి ఏరియా హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ జీనత్ బేగం, డాక్టర్ భాస్కర్ రెడ్డి, అనస్థటిస్ట్ డాక్టర్ వెంకట శివ, డాక్టర్ శైలేష్, రామాపురం, ఎండపల్లి, చిన్నమండెం, ఓబులవారిపల్లి, చెంబకూరు, మదనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'నవరత్నాలతో అందరికీ సంక్షేమ ఫలాలు'

ప్రజాశక్తి-రాయచోటి

సిఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాలతో సకల జనుల సంక్షేమం జరుగుతోందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సంబేపల్లె మండలం గుణ్ణికుంట్ల 2వ సచివాలయ పరిధిలోని గురిగింజకుంట, చిన్నపాపిరెడ్డిగారిపల్లె, దిన్నెపల్లె, మల్లూరు వాండ్లపల్లె, మాదిగపల్లె, నాయునివారిపల్లెలలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపిపి ఆవుల నాగశ్రీ లక్ష్మీ, సర్పంచుల సంఘ జిల్లా అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి, గొర్ల రమేష్‌రెడ్డి, జడ్‌పిటిసి గొర్ల కవిత, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ రఘునాథరెడ్డి, ఎంపిటిసి శ్రీధర్‌రెడ్డి, అన్నారెడ్డిలతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహశీల్దార్ మహేశ్వరి భాయి, ఎంపిడిఒ నరసింహులు, వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు, అమరనాథరెడ్డి, అనీల్‌రెడ్డి, ద్వారక నాథరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్‌లు దండు నాగభూషన్‌రెడ్డి, వెంకట రమణ నాయక్, నాగరాజు యాదవ్, అమరనాథరెడ్డి, మాజీ సర్పంచ్ దేవపట్ల వెంకట్రామిరెడ్డి, ఎంపిటిసి కాకులపల్లె రమణారెడ్డి, శెట్టిపల్లె లక్ష్మీకర్‌రెడ్డి, వాయల్పాటి ఆనందకుమార్‌రెడ్డి, మోటకట్ల అమరనాథరెడ్డి, వసంత శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మనూజరెడ్డి


వార్డుల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజరెడ్డి

మదనపల్లె అర్బన్: కౌన్సిలర్లు తమ తమ వార్డులలో సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజరెడ్డి అన్నారు. శుక్రవారం మదనపల్లి పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం, అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌన్సిలర్లు వార్డులలో సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక ద ృష్టి సారించాలని ఆమె అన్నారు. అనంతరం వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి మాట్లాడుతూ ప్రస్తుత వేసవిదృష్ట్యా ముస్లింల తాగునీటి కోసం సరఫరా చేస్తున్న ట్యాంకర్లను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్ మొబినా మాట్లాడుతూ తమ వార్డు పరిధిలోని సంత గేటు నందు సంతలో వ్యాపారం నిర్వహించుకునే వ్యాపారస్తులు చెత్తలు ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరగా అదనపు సిబ్బందిని సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మేనేజర్ పాండు రంగయ్య, ఇన్‌ఛార్జి డిఇ శిరీష, ఎఇ విష్ణుప్రియ, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

5న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి : సిఐటియు

మదనపల్లె అర్బన్: కార్మిక, కర్షక హక్కుల కోసం ఈ నెల 5వ తేదీన చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, టి.హరేంద్రనాథ్‌శర్మ అన్నారు. శుక్రవారం స్థానిక ఆటో స్టాండ్ వద్ద చలో ఢిల్లీ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.రెడ్డిప్రసాద్, వెంకటేష్, అశోక్, సుబ్ర మణ్యం, అంజద్‌బాష, మల్లన్న, నాగరాజా, జబివుల్లా, నాని పాల్గొన్నారు. **పీలేరు:** చలో ఢిల్లీనిజయప్రదం చేయాలని వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పురుషోత్తం, మాదినేని శంకర్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రామయ్య పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న హీరో కిరణ్

'మీటర్' సినిమాను ఆదరించండి

- సినీ హీరో అబ్బవరం కిరణ్

పీలేరు: తాను నటించిన కొత్త సినిమా 'మీటర్'ను ప్రతి ఒక్కరూ చూసి ఆదరించాలని సినీ హీరో అబ్బవరం కిరణ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సినిమా ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఏడవ తేదీన సినిమా విడుదలమ కానుందన్నారు. వేదికపై ఆయన విద్యార్థులతో కలిసి డ్యాన్స్ చేసి అభిమానులను ఆనందపరిచారు. అనంతరం ఏప్రిల్ 12, 13 తేదీల్లో జరగనున్న ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాల యానివల్ డే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ముందుగా ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఎంవి.అవినాష్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు కిరణ్ అబ్బవరంకు ఘనంగా స్వాగతం పలికారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాగిరెడ్డి

రాయచోటి: రాయచోటి బార్ అసోసియేషన్ న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది కె.నాగిరెడ్డి అధ్యక్షులుగా గెలిచారు. శుక్రవారం ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికల్లో 72 ఓట్లుకుగాను నాగిరెడ్డికి 42 వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా ఉదయగిరి రామాంజనేయులు, నాగమల్లుకు సమాన ఓట్లు రావడంతో చెరో ఆరు నెలలు ప్రధాన కార్యదర్శిగా ఉండేటట్లుగా ఒప్పందం కుదిరింది. ఉపాధ్యక్షులుగా పగడాల శ్రీనివాసులు, ట్రెజరర్‌గా వీరభద్రయ్య, స్పోర్ట్స్ కార్యదర్శిగా సిద్దయ్య, లైబ్రరీ సెక్రటరీగా రమణమూర్తి ఎన్నికల్లో గెలుపొందారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన తర్వాత విలేకరులతో నాగిరెడ్డి మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో చాలా మంది న్యాయవాదులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. వారి హక్కుల సాధన కోసం నాపై బాధ్యత ఉంచినందుకు కృషి చేస్తానన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలకడ

అభివృద్ధిని చూసి ఆదరించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బాటవారిపల్లి పంచాయతీలో ఆంజనేయ వడ్డిపల్లి, కొత్త గాండ్లపల్లి, గరడపగారిపల్లి, అక్కన్నగారికోట, అక్కన్న గారికోట హరిజనవాడ, కలకడ మాదిగపల్లి గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల వారికి చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రజల ఆదరిస్తున్నారని అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. నవరత్నాల పథకాలు పేదవారికి కల్పతరువుగా మారాయని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ముఖ్యమంత్రిపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేయడం తగదన్నారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్ర అభివృద్ధిని చూసి తిరిగి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, సింగిల్ విండో చైర్మన్ కమలాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రవి కుమార్‌రెడ్డి, మోహన్ రాజనాయుడు, రవికుమార్, మండలంలోని వైసిపి నాయకులు, తహశీల్దార్ రాము, ఎంపిడిఒ సిహెచ్ నారాయణ, ఎపిఎం రమేష్, ఎపిఒ చెన్నకేశవులు, ఎంఇఒ మునీంద్రనాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఇరగన్న, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శి నందిని, సచివాలయ, రెవెన్యూ , అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలను మింగేసిన 'కల్వర్టులు'



పంట కాలువలపై నిర్మించిన కల్వర్టులు

ప్రజాశక్తి- చిట్వేలు

కబ్జారాయుళ్ల చేతుల్లో పంట కాలవల మాయమై కల్వర్టులే మిగలడంతో కల్వర్టే కాలవను మింగేసిన విధంగా పరిస్థితులు తయారయ్యాయి. మండల పరిధిలోని చెర్లోపల్లి సమీపంలో సుమారు 800 ఎకరాలకు పైగా నీటిని సరఫరా చేసే జిల్లాలోనే అతిపెద్ద రెండో చెరువు యల్లమరాజు చెరువు. ఇటీవల చిట్వేలి మండలం రియల్ ఎస్టేట్ కు ఆర్థిక వనరుగా మారింది. సెంటు స్థలం వేల రూపాయల నుంచి లక్షల దాకా పలుకుతుండటంతో కబ్జారాయుళ్ల కన్ను పడింది. పొలాలకు నీటిని అందించే కాలువలపై కన్నేసి కబ్జాకు పాల్పడుతున్నారు. ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ కాలువలు పూర్తిగా కనుమరుగైపోయాయి. మండలంలో కోనసీమను తలపించే విధంగా ఉండే పాడిపంటలు ఇటీవల కాలవలు అదృశ్యం అవుతుండడంపట్ల సర్వత్ర విమర్శలు వినపడుతున్నాయి. పంట కాలువలకు అప్పట్లో నిర్మించిన రోడ్డు దగ్గర కల్వర్టులు జ్ఞాపకాలుగా ఉన్నాయి తప్ప, కాలవలు పూర్తిగా కనిపించలేదు. చెరువు, చెరువు ఆయకట్టు, పంట కాలవలను పరిశీలించి పరిరక్షించాల్సిన ఇరిగేషన్‌శాఖ అధికారులు రోడ్డు పక్కనే కాలవలు పూడ్చి కబ్జా జరుగుతున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇక రెవిన్యూశాఖ అధికారులు ఇరిగేషన్ అధికారులకే సంబంధమని, పంట కాలువలు కనుక మాకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎన్నోసార్లు కాలువల ఆక్రమణపై ఫిర్యాదులు చేసినా ఏ ఒక్క అధికారి పరిశీలించిన దాఖలాలు లేవు. ఇప్పటికే చిట్వేలి పరిసర ప్రాంతాలలో కొన్ని కాలువలపై నిర్మాణాలు జరిగిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పంట పొలాలకు ప్రాణాధారమైన నీటి కాలువలను పరిరక్షించాలని రైతులు కోరుకుంటున్నారు.

చెరువునీరే ఆధారం




వర్షాల వల్ల చెరువు పూర్తిగా నిండినా, చెరువు నుంచి వచ్చే పంట కాలవలు అదృశ్యమయ్యాయి. అరకొరగా ఉన్న మా పొలానికి చెరువునీరే ఆధారం. ఉన్నతాధికారులు స్పందించి చెరువు కింద కాలువలను కాపాడి నీరు వచ్చే విధంగా చూడాలి.

-వెంకటేశ్వర్లు, రైతు

మహిళలకు వరం వైఎస్ఆర్ ఆసరా : 'గడికోట'

ప్రజాశక్తి-గాలివీడు

వైఎస్ఆర్ ఆసరా పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలుకు వరం అని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల వైఎస్ఆర్ ఆసరా సదస్సును మండల కేంద్రమైన గాలివీడులో హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారన్నారు. మండలంలో మూడవ విడత కింద రూ4.3 కోట్లు లబ్ధి చేకూరిందని అన్నారు. వేల కోట్ల రూపాయలను నేరుగా ప్రజల ఖాతాలలో జమ చేయడం చరిత్రాత్మకమన్నారు. మూడన్నర ఏళ్ల కాలంలోనే సిఎం జగన్ సచివాలయ వ్యవస్థ, వాలంటరీ వ్యవస్థ, అమ్మఒడి, చేయూత, ఆసరా, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలును అమలు చేశారన్నారు. ఎంపిపి జల్లా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ జనరంజకంగా జగన్ పాలన సాగుతోందన్నారు. వైస్ ఎంపిపి మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందన్నారు. జడ్‌పిటిసి ఖాదర్ మోహిద్దీన్ మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు నాయుడు సిద్ధహస్థులన్నారు. గాలివీడు సర్పంచ్ లక్ష్మిదేవి మాట్లాడుతూ సిఎం మహిళ పక్షపాతి అన్నారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగభూషన్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పాలన కోసం మరల సిఎం జగన్‌నుకు అండగా నిలుద్దామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసి, ఎంపిడిఒ, శేఖర్ నాయక్ ఖాదర్ మోదీన్ పాల్గొన్నారు.



మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

గ్రామ సచివాలయం ప్రారంభం

గాలివీడు పంచాయతీ ఫకీర్‌రెడ్డిగారిపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామసచివాలయాన్ని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి జల్లా సుదర్శనరెడ్డి, ఎంపిడిఒ శేఖర్ నాయక్, వైస్ ఎంపిపి మిట్టపల్లి యధుబూషణ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రమేష్ కుమార్‌రెడ్డి, ఎంపిటిసిలు చంద్రారెడ్డి, గాలి శ్రీనివాసులు, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందిస్తున్న డేవిడ్ కళ్యాణ్ రాజ్

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జిల్లా చైర్మన్ డేవిడ్ కళ్యాణ్ రాజ్, వారి ప్రతినిధులు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతి రోజు జరిగే పరీక్షలను ఇష్టంగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.మాధవిలత, ఉపాధ్యాయులు పి.మధు బాబు, షేక్ షఫీ ఉల్లా, జి.శారద, ఎం.సుస్మిత, హెచ్‌ఆర్‌పిసిఐ ముస్లిం సెల్ చైర్మన్ ఎస్.జూల్ఫీకర్, విద్యార్థులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** ఏప్రిల్ 3 నుంచి జరగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు మంచి ఫలితాలు సాధిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ పేర్కొన్నారు. స్థానిక మోడల్ స్కూల్లో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సంవత్సరం పాటు కష్టపడిన ఫలితం కోసం కృషి చేసి మంచి ఫలితాలు సాధించాలని ఆమె సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు సాధించిన వారికి ఐఐటిలో సీటు పొందవచ్చు అన్నారు. వంట ఏజెన్సీ ఆంజనేయులు 82 మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు జంగుద్వేగం, శివ శంకర్ రెడ్డి నాగయ్య, నిత్యపూజయ్యా సుధాకర్, శ్రీనివాసులు ,సుజాత, విజయ కుమారి, విజయ, శ్రీకళ, ప్రసాదు, భారతి, పీడీ సోమశేఖర్ నాయక్, సుధీర్ కుమార్, రసూల్ ఆసిఫా, సోనియా విద్యార్థులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగార్జునచారి

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి పంచాయతీ ఎల్లంపల్లి సర్కిల్, సచివాలయం దగ్గర మినరల్ వాటర్ చలివేంద్రాలు సర్పంచ్ సోమారపు నాగార్జునచారి, ఎంపిడిఒ మధుసూదన్‌రెడ్డిలు ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా ప్రయాణీకులు, డ్రైవర్లు, బాటసారులు, ప్రజలకు సర్పంచ్ మినరల్ వాటర్ అందజేశారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రయాణికులు, ప్రజలు అందుబాటులో రద్దీగా ఉండే ఎల్లంపల్లి సర్కిల్ పక్కనే చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు బాకురమణయ్య, కనితి వెంకటరమణ, నాగేశ్వర, కేశవులు, స్వచ్ఛభారత్ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో గుడ్‌విల్ కళాశాల విద్యార్థి ప్రతిభ

బి.కొత్తకోట : శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ శుక్రవారం విడుదల చేసిన డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలలో పట్టణంలోని గుడ్‌విల్ డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ, బుచ్చిరెడ్డిగారి పల్లికి చెందిన ఎస్.శంకర కుమార్తె ఎస్.స్వాతి తమ కళాశాలలో డిగ్రీ చదువుతోందని, మండల స్థాయిలో మొదటి ర్యాంక్ కైవసం చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

తహశీల్దార్‌కు ఎండియు ఆపరేటర్ల వినతి

పెద్దమండ్యం : తమ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని 29 చౌకదుకాణ పరిధిలోని ఏడుగురు ఎండియు ఆపరేటర్లు తాహశీల్దార్ నిర్మలాదేవికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చౌక దుకాణం ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్న నిత్యావసర సరుకులో ఇంటి వద్దకు వెళ్లి చేస్తున్నామని, అయితే మాకు మంజూరైన వాహనాలపై ఇన్సూరెన్స్ ఈ ఏడాది రూ.19000 రూపాయలు మా వ్యక్తిగత ఖాతా నుండి రికవరీ చేశారని,గతంలో ఇలా చేయలేదని వారు తాసిల్దార్ విన్నవించారు. కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి ,రవీంద్ర నాయిక్, మహబూబ్ బాషా, మల్లికార్జున ,సురేంద్ర, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- కలకడ



ఇసుక రవాణాను అడ్డుకుంటున్న గ్రామస్తులు

అక్రమ ఇసుక రవాణాను గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన మండలంలో జరిగింది. మండలం లోని స్థానిక గంగాపురం పంచాయతీ గంగాపురం, కత్తి వారిపల్లి, కురవపల్లి, కలికిరి మండలం అద్దెవారిపల్లె, మహల్ గ్రామస్తులు కలసి స్థానిక బహుదానది నుంచి ఇసుకను అక్రమంగా తరలించడంపై అడ్డుకున్నారు. మా భూములకు వెళ్ళడానికి దారి లేకుండా పోవడమే కాకుండా, మా భూముల వద్ద ఉన్న బోర్లలో నీటి శాతం తక్కువ కావడం జరుగుతుందన్నారు. ఇసుకను మా భూముల ప్రాంతంలో తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటడం జరుగుతుందని ఇందుకోసం మా భూముల పరిసర ప్రాంతాల్లో ఇసుకను రవాణా చేయడం జరగదని గ్రామస్తులు ముక్తకంఠంతో భీష్మించి ట్రాక్టర్లను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న కలికిరి, కలకడ ఎస్‌ఐలు సంఘటనా స్థలానికి వెళ్లి గ్రామస్తులకు నచ్చజెప్పి సోమవారం వరకు ఇసుకను తరలించవద్దని ఎస్‌ఐలు చెప్పడంతో గ్రామస్తులు వెనుదిరిగారు.



అంగన్వాడీ కేంద్రంలో చిరుధాన్యాలతో వంట చేస్తున్న సిడిపిఒ

చిరుధాన్యాలతో పిల్లల్లో దృఢత్వం

ప్రజాశక్తి-రామాపురం

చిరుధాన్యాలతో చేసిన ఆహారం చిన్న పిల్లలకు దృఢత్వాన్ని ఇస్తుందని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ వై.పద్మావతి అన్నారు. మండలంలోని చిట్లూరు క్లస్టర్ పరిధిలోని బండపల్లి, కుమ్మరపల్లె, రాచపల్లి, చిట్లూరులోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం పోషన్ పఖ్వాడా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ అత్యంత విలువైన పోషకాలు చిరు ధాన్యాల్లో లభిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరు విధిగా ప్రతిరోజు చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. వీటిని ఉపయోగించడం వలన చాలావరకు దీర్ఘకాలిక వ్యాధులను, ఊబకాయాన్ని తగ్గించుకోవచ్చని అన్నారు. చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను, ప్రదర్శనలు తిలకించి చిరుధాన్యాలలో ఉన్న పోషకాలపై వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి ఎహెచ్‌ఒ చంద్రకళ ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కె.అరుణాదేవి, పద్మజ, తులసి, సుభాషిని, క్లస్టర్ పరిధిలోని చిట్లూరు, కుమ్మరపల్లె, బండపల్లి, రాచపల్లి పంచాయతీలకు సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై సమీక్ష

ప్రజాశక్తి-పెద్దమండ్యం

స్థానిక పంచాయతీ ఎంపిడిఒ ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శులకు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో ఇంటిపన్ను వసూళ్ళు వంద శాతం జరిగిందని తెలిపారు. వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమ నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయుష్మాన్ భారత్ సర్వే, ఎన్‌డిజి సర్వే వంద శాతం జరగాలని సూచించారు.

వేలం పాట ఆదాయం రూ.16 లక్షలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని వారపు సంత, దినసరి మార్కెట్ల నిర్వహణకు శుక్రవారం వేలంపాటలు నిర్వహించామని కమిషనర్ నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. వారపు సంతను హక్కులను ఆర్.ఎస్.ఇమ్రాన్ అనే వ్యక్తి రూ.12.82 వేలు, జిఎస్‌టితో కలిపి రూ.15.12 లక్షలకు దక్కించుకున్నారని అన్నారు. దినసరి మార్కెట్ హక్కులను రాజశేఖర్ రూ.1.24 లక్షలు కాగా, జిఎస్‌టితో రూ.1.46,320లకు దక్కించుకున్నట్లు తెలిపారు. ఏడాది కాలపరిమితితో ఈ వేలం పాటలు నిర్వహించామన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే వేలం పాటల ద్వారా రూ.6 లక్షలు అధిక ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. ప్రయివేట్ బస్టాండుకు వేలంపాట నిర్వహించినప్పటికీ, బస్టాండ్ హక్కులను దక్కించుకోవడానికి వేలంపాటకు ఎవరు ఆసక్తి చూపకపోవడంతో వేలంపాట రద్దు చేసినట్లు తెలిపారు. తర్వాత వేలంపాట నిర్వహించే తేదీని ప్రకటిస్తామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ తోపాటు అకౌంట్ ఆఫీసర్ బి.రమాదేవి, నగర పంచాయతీ ఆర్ఐ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.

3న దినసరి మార్కెట్‌కు వేలం పాట

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లెలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో దినసరి మార్కెట్, ప్రయివేట్ బస్టాండ్‌లలో రుసుము వసూళ్ల కొరకు ఈ నెల మూడవ తేదీ బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ నీలూఫర్, పంచాయతీ కార్యదర్శి రమణలు సంయుక్త ప్రకటనలో తెలిపారు. 3న సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తామని అన్నారు. రూ.50వేలు డిపాజిట్ ,తహశీల్దార్ జారీ చేసిన సాల్వెన్సీ సర్టిఫికెట్లను అందజేయాలన్నారు. పాట దక్కించుకున్న వారు వారం రోజుల్లోగా పూర్తి పైకం చెల్లించాల్సి ఉంటుందన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న బాస్, విసికె సభ్యులు

రాజ్యాంగ రక్షణ భేరి ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు, విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటియం శివప్రసాద్ ఆదేశాల మేరకు మదనపల్లిలో ఏప్రిల్ 8న జరిగే రాజ్యాంగ రక్షణ భేరి సభను జయప్రదం చేయాలని జ్యోతి సర్కిల్‌లో బాస్, విసికె పార్టీల ఆధ్వర్యంలో ప్రచార రథాన్ని ప్రారంభించారు. భారత రాజ్యాంగంపై జరుగుతున్న కుట్రలను పాట రూపంలో కళావాహిని కళాబృందం వేమనారాయణ, గిరిజ, సుభాషిణి, రత్నమ్మ, గోపాల్ నాయక్ బృందం వారిచే పాటలు, ఉపన్యాసాన్ని వినిపించారు. మదనపల్లె పట్టణంలో జరిగే రాజ్యాంగ రక్షణ భేరి సభకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వి.సి.కె పార్టీ,బాస్ నాయకులు సచిన్, సింగన్న, వెంకీ, మాధవ, గంగాద్రి, వెంకటేష్, రమణ, నరేంద్ర, మస్తాన్, గట్టు రాజు, మనోహర్, ఆనంద్ పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి కెజిబివిలో 2023-24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరమునకు (బైపిసి), ఇంగ్లీష్ మీడియం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.సుమతి ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఏప్రిల్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. **రామాపురం :** మండల పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి చేరు బాలికలు ఏప్రిల్ 27వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఒ పుష్పలత తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశానికి 5వ తరగతి పూర్తయి ఉండాలని, పదవ తరగతి పాసైన బాలికలు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకోవడానికి చేతకాని వారు పాఠశాలకు వెళితే ఆన్‌లైన్ చేస్తారన్నారు.

దళితవాడల సమస్యలను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-గాలివీడు

దళితవాడలో ఎవరికైనా ఇళ్లు లేకపోయినా, కాలనీలలో రోడ్లు, మురికి కాలువలు, వీధిదీపాలు వంటి మౌళిక వసతులు లేకుంటే తాత్కాలిక పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని తాహశీల్దార్ దైవాదీనం పేర్కొన్నారు. శుక్రవారం పంచాయతీలోని నలందివారిపల్లెలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎంతమందికి గృహాలు మంజూరు కాలేదని అడిగి తెలుసుకున్నారు. త్వరలో నివేదికను కలెక్టర్ పంపి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శేఖర్ నాయక్, విఆర్‌ఒలు అల్లా ప్రకాష్, వెంకటేశ్వర్లు, విఆర్‌ఎలు, చిట్టి బుజ్జి, కుమార్, నారాయణ, సలాది వారిపల్లి ప్రజలు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహశీల్దార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ధనుంజయులు

బీరంగిలో 'సివిల్ రైట్స్ డే'

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని బీరంగి గ్రామంలో సివిల్ రైట్స్ డేని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దార్ ధనుంజయులు, ఆర్ఐ బాలాజీ, ఎఎస్ఐ బొజ్జ నాయక్, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, సర్పంచులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు పౌరహక్కులపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. పౌరహక్కులను వినియోగించుకొనే స్వేచ్ఛను రాజ్యాంగం ప్రజలకు కల్పించిందన్నారు. పౌర హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు తరచు పౌరహక్కులపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు హాజరయ్యారు.



రైతులకు అవగాహన కలిగిస్తున్న ఉద్యానశాఖ అధికారి నాగరాణి

మామిడి పంటను ఆశించే తెగుళ్లపై శిక్షణ

ప్రజాశక్తి-రామాపురం

మామిడి పంటను ఆశించే నల్లతామర, పురుగుపండు ఈగ నివారణపై మండలంలోని నీలకంఠరావుపేట, సుద్ధమల్ల గ్రామ మామిడి రైతులకు లక్కిరెడ్డిపల్లి ఉద్యానశాఖ అధికారి నాగరాణి ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మామిడికాయ పై చిన్న చిన్న మచ్చలు, నక్షత్రకారపు మచ్చలు, గరుకుగా అవడం వల్ల మసి లాగా ఏర్పడడం నల్ల తామర పురుగు వల్ల జరుగుతుందన్నారు. నివారణకు పిప్రోనిల్ ఒక మి.లీ/లీటరు నీటికి ఎసిఫెట్ ఒక గ్రాము ఒక లీటరు నీటికి, అజాడిరక్టిన్ కలిపి పిచికారి చేయాలని వివరించారు. అలాగే నల్ల తామర పురుగుల నివారణకు తోటలో పసుపు, నీలి జిగురు అట్టలను ఎకరాకు 40 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పండు ఈగ నివారణకు మిథైల్ యుజినాల్ లింగకర్షక బుట్టలను ఎకరాకు 8 చొప్పున చెట్టుకు 5-6 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలన్నారు. పండు ఈగ కవర్లను ఏర్పాటు చేసుకొని మంచి నాణ్యతతో కూడిన దిగుబడిని పొందాలని సూచించారు. కార్యక్రమానికి రైతు భరోసా కేంద్ర సిబ్బంది ప్రవీణ్ కుమార్‌రెడ్డి, హారిక, రైతులు పాల్గొన్నారు.

'క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి'

ప్రజాశక్తి-కలికిరి

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకుంటారని చదివేవాడ్లపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంపత్ కుమార్ సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్దేశించే పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్, ముబారక్, జగన్మోహన్, అశోక్, సబితా, అరుంధతి, మంగమ్మ, ఉషారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కనులపండువగా రాములోరి కల్యాణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి పట్టణం కో-ఆపరేటివ్ సొసైటీ కాలనీలో వెలసిన శ్రీరామాలయంలో శ్రీరామ బ్రహ్మోత్సవ వేడుకలు కనులపండువగా జరుగుతున్నాయి. శుక్రవారం శ్రీరామసేవా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సీతా రాముల వారికి కల్యాణోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమం, పంచామృతాభిషేకాలు జరిగాయి. ముఖ్యంగా స్వామి వారి కళ్యాణాన్ని కనురాల వీక్షించడానికి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని, స్వామి వారిని దర్శించుకోని కృపా కటాక్షానికి పాత్రులైయ్యారు. ఆలయ కమిటీ భక్తులందరికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం గరుడ వాహన సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

ఘనంగా గురుదేవర మహోత్సవం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కొటాల రెవెన్యూ గ్రామం ఎద్దుల వారి కోటలో శనివారం నుంచి మూడు రోజులు పాటు ఎద్దుల వారి దేవరెద్దు దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ పెద్దన్న గురుదేవర మహోత్సవం ఘనంగా జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. శనివారం ఎద్దులవారి ఇలుకాపుల సనాతన సాంప్రదాయం ప్రకారం ఈ గురుదేవర మహోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. శనివారం నడ్డికొండ సారథి గుట్టలోని గురుదేవ గుహలో ఉన్న పూజా సామాగ్రిని తీసుకొస్తారన్నారు. దేవర ఇంటిలో సంప్రదాయ ప్రకారం నైవేద్యం తయారుచేసి సింహాసనం బావి వద్ద నిమ్మకంత గంగమ్మ తల్లికి ,వడ్డు మారెమ్మకు, గురుదేవర స్వామికి నైవేద్యం సమర్పిస్తారన్నారు. రాత్రికి కోలాటం, చెక్కభజన, జక్కికి వంటి సాంస్కృతిక కార్యక్రమం ఉంటుందన్నారు. ఆదివారం శ్రీ పెద్దన్న గురుదేవర గర్భస్థలానికి నైవేద్యం సమర్పించి అలుగు కత్తి నిలుపుతారన్నారు. సోమవారం గురుదేవర పూజ సామాగ్రిని ఊరేగింపుగా తీసుకెళ్లి సారాతి గుట్ట గుహ నందు యధావిధిగా భద్రపరుస్తారన్నారు. భక్తులు హాజరై మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.

క్రైం కార్నర్

నలుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీ బద్దిరెడ్డి గారి పల్లెకు చెందిన గుర్రంకొండ కృష్ణప్ప భార్య రెడ్డమ్మను, ఆమె కుమార్తె లక్ష్మి దేవిలను, అదే గ్రామానికి చెందిన రెడ్డమ్మ బావ వెంకటరమణ, అతని భార్య వెంకట లక్ష్మమ్మ వెంకటరమణ బంధువులు పట్టాభి, పట్టాభి కుమారుడు నరసింహులు కలిసి పాత కక్షలు కారణంగా దాడి చేసి గాయపరిచారని రెడ్డమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పేకాట స్థావరం పై దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గురువారం సాయంత్రం రెడ్డివారిపల్లి పంచాయతీ యర్రాతివారిపల్లి సమీపంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందిందన్నారు. ఆ మేరకు హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి పోలీసు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి సోమానుపల్లి కాలనీకి చెందిన కొండేటి నరసింహులు, నిమ్మనపల్లి బాలాజీ, నిమ్మనపల్లి రామాంజులు, పేరి శ్రీనాథ్, మానిని భానుప్రసాద్ లను ఐదుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1300 రూపాయలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.